



హరిమోహన్ క్షణంపాటు నిర్ఘాంత పోయి, దేన్నో వెతుకుతున్నట్టుగా, తదేకంగా మణిమాల కళ్ళల్లోకి సూటిగా చూడసాగాడు

అనుకోకుండా ఆవరించిన సిగ్గుతో మణిమాల తలవంచుకున్నది.

హరిమోహన్ మాట్లాడకపోవడం గమనించి, ఆమె తలయెత్తి చూడగా, అత నింకా అదే పద్ధతిలో తనను చూస్తున్నాడు

"అట్లా చూస్తారేం? నే నేదైనా అసహజంగానూ, అసంభవంగానూ ఉండేపద్ధతితో మాట్లాడానని అనుమానిస్తున్నారా?" అన్నది మణిమాల

హరి కాస్త తేరుకున్నాడు

"ఎందుకో మీరు తొందరపడ్తున్నారనిపిస్తోంది అన్ని విషయాలూ బాగా ఆలోచించుకున్నారా? నేను చాలా సామాన్యమైన గుమాస్తాని వయసులో మీకంటె బాగా పెద్దవాణ్ని. ఇద్ద రాడపిల్లలకు తండ్రిని..." అంటూ ఇంకా చెప్తుండగానే మణిమాల మధ్యలో అడ్డుపడింది

"నాకన్నీ తెలుసు. నే నేం తొందర

పడలేదు. నే నేదో త్యాగం చేస్తున్నా నన్న భావనతో ఈ నిర్ణయానికి రాలేదు - ఇందులో నాకు సౌఖ్యముందనిపించే ఇలా..."

మధ్యలో చెక్కిళ్ళు ఎర్రబడగా, తడబడే మాటల్ని మ్రింగేసింది మాల.

హరిముఖం వేయి విద్యుద్దీపాల కాంతులతో వెలిగింది

"ఇంతకన్నా నాకొకావలసిందేముంటుంది? అయినా మరొకసారి చెబుతున్నాను ఇంత చిన్నవయసులో ఇద్దరు పిల్లల బాధ్యత మీరు స్వీకరించవలసి వస్తుంది "

"మీకు తెలియదు నాకు కావలసిందే ఆ పిల్లలు! నాకు చిన్నప్పటినుండీ విపరీతంగా కడుపునొప్పి వచ్చేది. ఆ బాధ భరించలేక, ఆపరేషన్ చేయించుకున్నాను. ఆ కారణంగా లేడీడాక్టరు నాకు సంతానార్హత ఉండదని చెప్పింది నాకు పిల్లలంటే విపరీతమైన వ్యామోహం నా వ్యామోహాన్ని భగవంతుడు ఈ పద్ధతిలో తీర్చదలచా డనుకుంటాను." అన్నది మణిమాల ఆమెకళ్ళు కొద్దిగా చెమ్మగిల్లి ఉండటం గమనించాడు.

మాల మళ్ళీ "నేను మీ ఇంటికి వచ్చి, ఆ తల్లిలేని పిల్లలను చూసిన దగ్గర్నుంచీ వాళ్ళకు తల్లిని కావాలనే ఆశ నాలో రోజురోజుకీ అధికం కాసాగింది. ఈ అభిప్రాయం మీ ముందు చాలా సార్లు వ్యంగ్యంగా వ్యక్తపరిచాను. మీరు గ్రహించుకోలేదు. చివరకు సాహసించి ఇలా..." ఆగిపోయింది మాల

"ఉత్తమూర్ఖుణ్ణి! అవునా?" అన్నాడు హరి అమాయకంగా.

మణిమాల నవ్వేసింది. ఆమె నవ్వులో హాయిగా శృతికలిపాడు హరిమోహన్.

మణిమాల తనజీవితంలోకి ప్రవేశించిన తరువాతనే నిజమైన దాంపత్య జీవితానందాన్ని రుచిచూడ గలిగాడు హరిమోహన్ అతని మొదటిభార్య చాలా అనారోగ్యపు వ్యక్తి - మేనరికమని అతని ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండానే జరిగిపోయింది ..

ఐదేళ్ళుమాత్రమే ఆమెతో సంసారం చేశాడు హరి ఆ ఐదేళ్ళలోనూ ఏనాడూ సుఖమనేదేమిటో ఎరగడు. కాపురానికి వచ్చి ఏడాది తిరిగకుండానే కాన్పు - అందులో జబ్బు, అప్పులు, చాలీచాలని జీతం, చిరాకులు, ఎడముఖం, పెడముఖం.

కాస్త ఆరోగ్యం కుదుటపడిందనుకోగానే, మళ్ళీ కాన్పు, మళ్ళీరోగం - ఆ రోగంనుంచి, మళ్ళీ ఆమె కోలుకోలేదు.

భార్య మరణించినపుడు తనతో అలవాటుపడిన ఒక ప్రాణిపోయిందని కొంత విచారం కలిగినా తరువాత అతని దృష్టంతా, పిల్లలమీదకు మళ్ళింది జయ ఐదేళ్ళది - మాయ మూడేళ్ళది. ఇద్దర్నీ

ప్రైమరీ స్కూల్లో చదివిస్తున్నాడు. వాళ్ళ సంరక్షణ చూసుకుంటూ వాళ్ళ తోటిదే లోకంగా గడుపుతున్నాడు. మొదటి భార్యతోటి సంసారిక జీవితానుభవం అతనికి ద్వితీయ వివాహపుటాలోచనైనా రానీయలేదు – మణిమాల మాటలు తన కనేకపర్యాయాలు చక్కిలిగింతలు పెట్టినమాట నిజమే! అయితే, అది కేవలం భ్రమ ఆ అమ్మాయి చిలిపితనమని తనను తానే మరిపించుకున్నాడు కాకపోతే, ఆఫీసులో మేనేజరు మొదలుకొని అందరకూ గుండెల్లో దీపమై 'కలలబాల' అనిపించుకునే మణిమాల తనను వరిస్తుందని ఎలా ఊహించటం?

మాయ పుట్టినరోజున ఆఫీసు సిబ్బంది అంతా వచ్చారు. మణిమాల వచ్చిందగ్గర్నుంచీ పిల్లల్నిచూసి ముచ్చటపడటంతోనే సరిపోయింది. వాళ్ళకు తల్లి లేనందుకు ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయికూడా, కొత్తగౌను తెచ్చి మాయకు స్వయంగా తొడిగింది పువ్వులు తెచ్చి తమాషాగా ముద్దుగా ముందు అమర్చింది అంతా వెళ్ళిపోయాక కూడా పిల్లలతో ఆడుకుంటూ కూర్చుంది మాల. తనను స్వంత విషయాలనేకం అడిగింది. అప్పుడు తెలియలేదు కాని, – "తలవంచుకుని పిల్లల్నిలా తల్లిలేనివాళ్ళుగానే ఉంచుతారా?" అన్న మాలప్రశ్న ఇప్పుడు బాగా అర్థ మవుతూంది. ఆ రోజు మరీ పొద్దుపోతే, మణిమాలను తనే వాళ్ళ ఇంటిదగ్గర దిగవిడిచి వచ్చాడు –

మణిమాల హరి జీవితాన్నే మార్చివేసింది. ఉదయం కళ్ళు తెరుస్తూనే, రేగినతలతో హడావిడిగా వంకరటింకరగా పెట్టుకున్న బొట్టుతో, బడలిక వదలని ముఖంతో వంటింట్లో పనుల్లో మునిగిపోయిన మణిమాలను చూస్తూంటే హరికి మానవజీవితం ఎంత ఆనందమయమో, అర్థమయ్యేది ముఖమైనా కడుక్కోకుండానే మాలను సమీపించబోతుంటే చేతులురెండూ ముఖానికి అడ్డంపెట్టుకుని "అబ్బబ్బ? మరీ చిన్నతనం – అవతల పిల్లలు!" అని అందముగా విసుక్కొని "తొందరగా ముఖం కడుక్కురావాలి మరి కాఫీరెడీ!" అని ఊరించేది. జయకూ మాయకూ, మాల స్వయంగా తలలుదువ్వి బడికి తయారుచేసి పంపుతూంటే, హరిహృదయం, ఆనందంతో కృతజ్ఞతతో ఊగిపోయేది. పిల్లలు పిన్నీ, పిన్నీ, అంటూ మాలచుట్టూ తిరుగుతూంటే, అతను పరవశత్వంతో అలా చూస్తూ కూర్చునేవాడు. స్నానం చేసి ఇవతలకు వచ్చేసరికి. తయారుగా తను తీసుకోవలసిన పంచా – షర్టూ ఉండేవి – తను చిందరవందరగా వదిలేసిన ఫైళ్ళన్నీ చక్కగా కట్టలుకట్టి ఉండేవి. పిల్లల్ని బడికిపంపి, ఇద్దరూ ఒక్కసారి కూర్చుని, అన్నాలు తిని,

ఒకేరికాలో ఆఫీసుకు వెళ్తూంటే, తాను స్వర్గంలో ఉన్నాననే అనిపించేది హరికి_

తన పిల్లలకు తల్లిగాకంటె, తనకు భార్యగానే మణిమాల తనజీవితా న్నావరించుకుందనే సత్యం తెలిసిరావటానికి ఎక్కువరోజులు పట్టలేదు, హరిమోహన్ కుందనపు బొమ్మలా, మెరుపులు విరజిమ్ముతూ తనను మురిపించి మరిపించే మాల ఆతనికి జీవిత సర్వస్వమూ అయింది ఆరసమయ ప్రపంచంలో ఆతనికి ప్రపంచమూ, పిల్లలూ, బాధ్యతలూ, అన్నింటినుండీ మైమరపు కలుగుతూంది.

"మంచి ఇంగ్లీషు పిక్చరాడుతున్నది, వోదామా?" అన్నాడు హరి ఆశగా, ఒక రోజున

"పిల్లలో?" అన్నది మాల

"వాళ్ళుకూడా చూడతగ్గదే లే, బెంగెట్టుకోకు!" అన్నాడుహరి నవ్వుతూ.

"చూడతగ్గదే కావచ్చండీ! కాని చూడగలరా అని, సగంలోనే చికాకు పడివోతారు! మీరు వెళ్ళిరండి."

"నే నెంతో ఆశగా అడిగితే చివరికిదా? నీకు పిల్లలే ఎక్కువలాగుంది!" అన్నాడు హరి నొచ్చుకుంటూ

"ఈ మాత్రానికే అంత నొచ్చుకోవాలా? పదండి," అంటూ మాల పిల్లలతోసహా సిద్ధమయింది


మాల అనుకున్నట్టే, ఇంకా ఇంటర్వెల్ అయినా కాకుండానే, రెండోది ఏడుపు ప్రారంభించింది హాలులో మిగిలిన వాళ్ళకు ఇబ్బంది కలుగకుండా మాల, మాయను ఎత్తుకుని బయటకు వచ్చెయ్యబోయింది. హరిమోహనుకు ఎక్కడలేని కోపమూ వచ్చింది "రెండంటించి నోరుమూసి కూర్చోపెట్టు దాని ఏడుపుకోసం నువ్వు సినిమా చూడటం మానెయ్యటమేమిటి!''విసుగ్గా అన్నాడు

మాల విచిత్రంగా అతనివైపు చూసి సమాధానం చెప్పకుండా మాయను ఎత్తుకుని బయటకు నడిచింది. హరిమోహన్‌కు చిరాకెక్కువయింది. సినిమా హాలులో కూర్చున్నాడన్న మాటే కాని, ఒంటినిండా తేళ్ళూ జెర్రులూ పాకుతున్నట్లనిపించింది ఇక ఎక్కువసేపు ఉండలేక తనూ బయటకు వచ్చి "మాయను నా కిచ్చి, నువ్వు లోపలికెళ్ళి సినిమా చూడు." అన్నాడు,

మాల నవ్వి "అక్కర్లేదు సినిమాలంటే నా కంత సరదాలేదు. మీరే లోపల కూర్చోండి,'' అంది.

"నీతో కలిసి చూడాలని వచ్చాను కానీ, లేకపోతే, ఈ సినిమాకోసం ఎవడేడ్చాడూ?" విసుక్కున్నాడు హరి.

మాల తలవంచుకుని తనలో తను నవ్వుకుంది ఇంతలో మాలా హరీకూడా బయటకు వెళ్ళిపోవటం వల్ల జయ బిత్తరపోయి, ఏడుస్తూ, బయటకు వచ్చింది. మాల మాయను హరికి వప్పగించి, జయను సముదాయించి, జయతో




కూతురు - "అమ్మా నేను పుట్టినప్పుడు నువ్వింటిదగ్గరేవున్నావా ?"
తల్లి - "లేదమ్మా అమ్మమ్మగారింటి దగ్గరున్నాను"
కూతురు - "అయితే నన్నుచూసి నీకు ఆశ్చర్యమేసి వుంటుంది గదూ!

---

హాలులోకి వెళ్దామనుకునేటంతలో జయ బాతురూంకి పోవాలంది. మాల జయను బాతురూంలోకి తీసుకువెళ్ళి తిరిగి వచ్చే సరికి మాయ పెద్దగా ఏడుస్తూంది.

"ఎందుకలా ఏడుస్తూందీ?" అంది మాల కంగారుగా. హరి ఏమైనా కొట్టా డేమోనని

"ఎక్కడలేని దాహమూ ఈ క్షణం లోనే ముంచుకొచ్చిందట ఈ రాక్షసికి'' కసిగా అన్నాడు హరి

"ఇలా _ఇవ్వండి బయట ఏదైనా డ్రింక్ ఇప్పించి వస్తాను."

"ఏం వద్దు, దీన్ని తీసుకో, రిక్షా పిలుచుకువస్తాను. ఇంటికి పోదాం ఈ సినిమా చాల్సు"

మాయను విసురుగా మాలమీదకు తోసేసి విసవిస వెళ్ళిపోయాడు హరి.

ఇంటికి చేరుకునే వరకు ఎవ్వరూ ఒక్కమాటకూడా మాట్లాడలేదు. ఇంట్లోకి అడుగుపెడుతూనే "ఛీ! ఛీ!

వెధవసంత హాయిగా ఒక్క సినిమా ఐనా చూసే యోగ్యత లేదు" అంటూ విసుక్కున్నాడు హరి. మాల గతుక్కుమంది ఒక్కసారి అయోమయంగా హరిముఖం వంకచూసి, తొందరగా అందరకూ పక్కలువేసి ఇంకా ఏవేవో పేచీలు పెడుతున్న జయనూ మాయనూ చెరొక ప్రక్క పడుకోబెట్టుకుని తను మధ్యలో కూర్చుని వాళ్ళను జోకొట్టి నిద్రపుచ్చింది.

ఆ రాత్రంతా హరి మాలతో మాట్లాడలేదు ఆమె నిశ్శబ్దంగా తనలో తను బాధపడి ఏడ్చిందన్న విషయం కూడా అతనికి తెలియదు. మరునాడు కూడా హరి ముభావంగానే ఉన్నాడు. మాలకూడా అలానే నిర్లిప్తంగా ఊరుకుంది. కానీ, మాలతో ఎక్కువరోజులు ముభావంగా ఉండగలగటం హరికి సాధ్యం గాదు. అందుకే ఆ మరునాడే మాలను ఆప్యాయంగా పలుకరించాడు మాల నవ్వుతూ సమాధానం చెప్పింది వాతావరణంలోని గ్లాని మాయమయి మళ్ళీ రోజులు సాఫీగా గడుస్తున్నాయి.


బజారునుంచి వస్తూ దారిలో మల్లె పూలను చూసేసరికి హరికి మణిమాల గుర్తుకు వచ్చింది. పూలుకొని ఆ పొట్లాన్ని నలిగిపోకుండా భద్రంగా చేతిలో పుచ్చుకుని, దారిపొడుగూతా, ఆ పూల నలంకరించుకున్న మణిమాలనూ మాల తలలోని ఆ పూలు తనకు కలిగించే పారవశ్యాన్నీ ఊహించుకుంటూ, ఇంటికి వచ్చి ఆ పూలను మాలకందించాడు. మాల మల్లెలనుచూసి మురిసిపోయింది భర్త వంకచూసి కొంటెగా నవ్వి ఆ పూలను తడి రుమాలులోచుట్టి, భోజనాలయాక కూర్చుని ఆ పూలన్నీ మాలకట్టి, జయకూ మాలకూ, చిన్న చిన్న ముక్కలు తుంపి, మిగిలినది తను తలలో పెట్టుకోబోయింది. అంతలో జయ అడ్డుతగిలి "పిన్నీ! ఆ పూలన్నీ నాకే కావాలి. పక్కింటివాళ్ళ రాధలాగా నేనూ జడంతా పువ్వులు పెట్టుకుంటా!" అంది

సాధారణంగా పిల్లల కోరికల కడ్డు చెప్పని మాల పువ్వులమీది ప్రలోభంతో "జయా! నీకు రేపు బోలెడన్ని పువ్వులు తెప్పించి జడంతా కుడతా! ఇవాళనే పెట్టుకుంటానమ్మా!" అంది

జయ వెంటనే రాగం అందుకుంటూ "ఆ!...ఆ! నాకు ఇవాళే కావాలి, నువ్వే రేపు పెట్టుకో!'' అంది.

మాల ఇంకా ఏదో సమాధానం చెప్పే లోగానే హరి ఉగ్రనరసింహరూపం ధరించి, జయను, ఆ లెంపా ఈ లెంపా వాయించటమూ, అది ఇల్లెగిరిపోయేలాగ శోకాలు ప్రారంభించటమూ జరిగిపోయాయి

మాల మ్రాన్పడిపోయింది _ ఆమె చేతిలోని పూవులదండ అప్రయత్నంగా జారి క్రిందపడిపోయింది. ఏడుస్తున్న



జయను సముదాయిద్దామని దగ్గరకు వెళ్ళేసరికి, జయ, మాల చేతులు తోసి పారేసి మరింత బిగ్గరగా రాగం ప్రారంభించింది

"ఊరుకో జయా! అన్ని పూలూ నీకే ఇస్తానులే! మా తల్లివిగా ఊరుకో! రేపు నీకు బోలెడన్ని చాక్‌లెట్లు కొని పెడతా!" ఇత్యాది అనునయ వాక్యాలన్నీ జయ ఏడ్పును అధికం చేశాయే కాని, కొంచెమైనా తగ్గించలేదు. ఏడ్చి, ఏడ్చి జయ నేలమీదే నిద్రపోయింది ఆ లేత చెంపలమీద ఎఱ్ఱగా తేలిన హరివేళ్లు, మాల గుండెలను రంపపుకోత పెట్టాయి. ఇంతకూ కారణం తను పూలకోసం ఆశపడటమేనన్న భావన ఆమెను మరింత కుమిలిపోయేలా చేసింది. నిద్ర పోతున్న జయను లేవనెత్తి మంచం మీద పడుకోబెట్టి, పొంగివస్తున్న కన్నీళ్ళను తుడుచుకుంటూ, తనుకూడా జయ పక్కనే పడుకుంది.

ఏమనడానికీ తోచలేదు హరికి తాను పిల్లలనుకొట్టడం మాలకు చాలా బాధ కలిగిస్తుందని తెలుసు నేలమీద పడిఉన్న మల్లెలమాల అతనిని వెక్కిరించినట్లయింది చల్లనిపిల్లతెమ్మెరలూ, పున్నమి వెన్నెలల అందాలూ, నేలమీద పడి గదినంతా గుబాళింప చేస్తున్న మల్లెల తీయని పరిమళమూ, అతనిని

ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అయినా ఆ మల్లెలమాలతో కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ జయ ప్రక్కన పడుకున్న మాలను సమీపించే సాహసం కలుగలే దతనికి— ఏదో తెలియని ఉడుకుమోతుతనంతో ఉక్రోషంతో అతని హృదయం మూలగ సాగింది మొదటిభార్యతో కాపురమంతా ఏడుపులతో మొత్తుకోళ్ళతో అయిపోయింది. బంగారు బొమ్మలాంటిభార్య లభించీ తనకీ కర్మమేమిటి? తనకు రెండవపెళ్ళి అన్నమాటేకానీ ముప్ఫయి అయిదేళ్ళన్నా నిండలేదు. ఇప్పటినుండే వానప్రస్థాశ్రమ స్వీకారమా? అందులో మాలలాంటి భార్యను ప్రక్కనుంచుకుని!

రాత్రంతా ఈ ఆలోచనలతోనే గడిచింది హరికి మరునాడు ఉదయం ఎంతో ఆందోళనతో ఉన్నట్లున్న హరిముఖం చూసి, మాల, హరికూడా జయను కొట్టినందుకు బాధపడుతున్నాడని అనుకొని ఆ భావనవల్ల హరిమీద జాలికలిగి చిరునవ్వుతో అనునయవాక్యాలతో అతనిని ఆశ్వాసించింది మాల చిరునవ్వు హరి హృదయంలో కల్లోలాన్నంతా క్షణంలో తుడిచిపెట్టేసింది

ఆ సాయంకాలం హరి, మామూలుకన్నా, గంటఆలస్యంగా ఇంటికొచ్చాడు.

"మన పిల్లలు చదువుకుంటున్న స్కూలువాళ్ళు చక్కటి ఏర్పాటొకటి చేశారు చిన్నపిల్లలకు హాస్టలు తెరిచారు వీళ్ళిద్దర్నీ అందులో చేర్పించే ఏర్పాటు చేసివస్తున్నాను." అన్నాడు హరి.

ఆ ఆఖరిముక్క అంటున్నప్పుడు, హరిగొంతు బాగా ఎండిపోయింది.

మాల నిర్ఘాంతపోయింది. క్షణంలో తేరుకుని, చకచక హరిదగ్గరకు నడిచి, "ఏమిటి మీరు మాట్లాడుతున్నదీ?" అంది తీక్షణంగా.

ఆమె తీక్ష్ణస్వరానికి ఒక్కసారి హరి గుండెలు ఝల్లుమన్నాయి. అయినా, అతడు తన నిర్ణయాన్ని మార్చుకోదలచలేదు. అందుకనే తనస్వరాన్ని సాధ్యమైనంత దృఢంగా మార్చుకుని "నువ్వు వింటున్నావనే అనుకున్నాను!" అన్నాడు

ఆ సమాధానం మాలను మరింత మండించింది "వినబడక పోవటానికి చెవుడులేదు అసంభవాలైన విషయాలు మాట్లాడితే అర్థంచేసికోలేక పోతున్నాను"

"పిల్లల్ని హాస్టల్లో చేర్చిరావటంలో అసంభవమేముందీ?"

"నాకంఠంలో ప్రాణంఉండగా అది అసంభవమైనవిషయమే!"

"నాపిల్లలు— నాఇష్టం! నేనువాళ్ళను హాస్టల్లో ఉంచేస్తాను"

"మీపిల్లలూ? ఒక్కనాటికి కాదు ఇన్నాడిప్పుడు మీరే అన్నారు మన పిల్లలని! అంతలోనే మాటమార్చా? మిమ్మల్ని నేను పెళ్ళిచేసుకున్నాక వాళ్ళు మనపిల్లలు— నా ఇష్టం లేకుండా మీరు పిల్లల విషయంలో ఏం చెయ్యటానికీ వీల్లేదు."

"ఓః అదీః అలాచెప్పు నీకు కావల సింది పిల్లలు. నేనుకాదు— నామీద నీకు కొంచెమైనా, ప్రేమలేదు నీకు పిల్లలు పుట్టరుగనుక నన్ను పెళ్ళిచేసుకున్నావు ఇప్పుడు పిల్లల్ని అడ్డుపెట్టుకుని నన్ను తప్పుకు తిరుగుదామని చూస్తున్నావు అంతేనా ?" కసిగా అన్నాడు హరి

మాల మతిపోయినట్లు అతనిముఖం లోకి చూసింది, ఏ సమాధానమూ ఆమె నోటినుండి రాలేదు

హరితిక్క, ఇంకా పెరిగింది

"కాని, మాలాః ఇదివిను, పిల్లల్ని పెంచడమే, నాకు కావలిస్తే, ఒక ఆయాను పెట్టుకోగలను. అందుకోసం పెళ్ళిచేసుకుని వాళ్ళప్రాణానికి ఒక సవతి తల్లిని తీసుకరావక్కర్లేదు"

బ్రహ్మాస్త్రం వదిలాడు హరి. మాల కళ్ళుతిరిగి నేలమీదకూలింది. హరిఆత్రు తగా ఆమెదగ్గరకు రాబోయాడు మాల చీదరగా అతనివంక ఒకసారిచూసి చటుక్కున అక్కడనుండి లేచిపోయింది హరికి మాలమీద అంతులేని కోపం వచ్చింది.

సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి వచ్చిన హరికి మాల కనబడక పోయే సరికి, చాలా ఆశ్చర్యం కలిగింది. తన కంటేముందే ఆఫీసులోంచి బయలు దేరింది. ఇంటికే వచ్చి ఉంటుందని అను కున్నాడు. పిల్లలు అప్పటికే ఇంటికి వచ్చేశారు — పనిమనిషి వాళ్ళకు నీళ్ళు పోసి బట్టలు మార్చి పాలుత్రాగించింది. వాళ్ళు ఆడుకోవటానికి వెళ్ళారు. ఏడు గంటలయినా మాల రాకపోయేసరికి హరికి కంగారు కలిగింది. అంతలో తన మీద అలిగి వాళ్ళ ఇంటికెళ్ళి ఉండ వచ్చునని ఆలోచన కలిగింది, ఆ ఆలో చనతో అతనిలో పౌరుషం మరింత పెరి గింది. "వెళ్ళనీః మహ తనే దిక్కయి నట్టు...!" అనుకున్నాడు హరి.

పిల్లలు ఆకలి అని గోలపెడ్తున్నారు. విసుగ్గా ఉంది అటు ఆఫీసులోనూ, ఇటు ఇంట్లోనూ పనులు చేసుకోగల్గటం ఆడ వాళ్ళకే చెల్లింది. ఆఫీసునుంచి వచ్చి కుంపటి అంటించుకోవాలంటే ఎంత విసుగూ ?

వంట ప్రారంభించాడు. వంట పూర్తి కాకుండానే మాయ ఆకలి అని ఏడ్చింది. ఒళ్ళుమండి దాని వీపుమీద రెండు అంటించాడు. అది ఏడ్చి ఏడ్చి అన్నం తినకుండానే నిద్రపోయింది. చెల్లెలికి తగిలిన దెబ్బలు చూడటంతోనే జయకు ప్రారంభం కాబోయే పేచీ దానంతట అదే ఆగిపోయింది బిక్కుబిక్కు మంటూ ఓ మూల కూర్చుంది. తండ్రి అన్నం పెడుతూంటే సాహసించి "పిన్ని ఏది నాన్నా ?'' అంది. హరికి తెగ విసుగ్గా వుంది. "మీరు అల్లరిచేస్తున్నారని ఇక్క డకు రాకుండా వెళ్ళిపోయింది." అన్నాడు. జయ గతుక్కుమంది. ఆ చిన్నారి కళ్ళలో నీళ్ల నిండాయి. తన


అల్లరివల్ల పిన్ని వెళ్ళిపోయిందా? అమ్మో! తనింకెప్పుడూ అల్లరిచెయ్యదు. పిన్ని కావాలి. "పిన్నిని రమ్మనిచెప్పు నాన్నా!" అంది జయ జాలిగా.

"రాదు!" అన్నాడు కోపంగా హరి. కోపంతో వున్న తండ్రిముఖం చూసి ఇంకేమీ మాట్లాడలేకపోయింది.

ఆ మరునాడే జయనూ, మాయనూ, హాస్టల్లో చేర్పించాడు హరి. మాయా, జయా ఇద్దరూ తాము హాస్టల్లో ఉండమని గోలపెట్టి ఏడ్చారు. బలవంతంగా వాళ్ళ నక్కడ ఉంచి వచ్చేశాడు హరి. అతని మనసంతా అల్లకల్లోలమయి పోయింది. యాంత్రికంగా ఆఫీసుకు వెళ్తున్నాడు. వస్తున్నాడు. ఆఫీసులో రోజూ మాల కన్పిస్తూనే ఉంది. కానీ వంచిన తలైనా ఎత్తి చూడదు. కేవలం ఒక అపరిచితురాలిలాగ తన పనిని తాను చేసుకుపోతూ ఉంది. ఆమెను పలుక రించాలని హృదయం ఎంత ఆక్రోశించినా అహం అడ్డువచ్చి నిగ్రహించుకునే వాడు హరి. పిల్లల్ని చూడటానికి వెళ్ళినప్పు డల్లా వాళ్ళు అక్కడి నుండి వచ్చేస్తా మని గోల చేయసాగారు. మాయ ముద్దు మాటలతో "నేను పిన్ని దగ్గలకు పోతా!" అంటూ ఏడ్చేది. "నేను నిజంగా అల్లరి చెయ్యను నాన్నా! పిన్నిని రమ్మ నవూ?" అనేది జయ.

హరి నిగ్రహం సడిలిపోతూంది మాల దగ్గరకుపోయి ఆమెను తన దగ్గ రకు రమ్మని ప్రార్థించాలనుకునేవాడు, అంతలోనే తను అలా తేలిపోతే ఆమెకు మరింత లోకువవుతాననే భయంతో ఉగ్గపట్టుకునేవాడు.

హరికింకో విషయం తెలిసివచ్చింది. మాల తన కార్థికంగా కూడా ఎంతో అండగా ఉంటున్నది. ఆ నెల హాస్టలు ఫీజులూ, బడిజీతాలూ. కిరాణా పద్దులూ, పనిమనిషి జీతమూ, చాకలిజీతమూ, అవీ, ఇవీ అన్నీ ఆయేసరికి అరవతేదీ అన్నా రాకుండానే జీతమంతా అయిపో యింది. హరికి గుండెల్లో రాయిపడింది. ఆలోచిస్తున్నకొద్దీ మాల విలువ పెరుగ సాగింది. మూర్ఖుడు తను! దేవత తన మీద దయ తలిచి కరుణతో వరప్రదానం చేస్తే అహంకారంతో కాలదన్నుకుని దురదృష్టాన్ని చేతులారా ఆహ్వానించు కున్నాడు. ఒకవేళ తనిప్పుడు ప్రార్థిం చినా, వెనుకటి అవమానాన్ని మర్చి పోయి, మాల మళ్ళీవస్తుందా? పూర్తిగా తనమీద మనసు విరిగిపోయిందా? ఆమె మనసులో పుండు ఎక్కడో అక్కడే కారం రాశాడు. ఆ మంట చల్లారు తుందా? ఒక్కక్షణమైనా పిల్లలను వదిలి ఉండనిది ఇన్నిరోజు లెలా ఉండగలి గింది? మాతృమూర్తి కాకపోతేనేం? అసలైన మాతృహృదయ మామెది. తన మాటలతో మనసు చిల్లులు పడి దూరంగావున్నా, లోలోపల ఎంత బాధ పడుతూందో?




గోరుచుట్టుమీద... రోకలిపోటులాగ, సరిగ్గా ఇదే సమయంలో జయకు జ్వరం తగిలింది. డాక్టర్ టెంగజ్వరం కావచ్చు నని చెప్పటంవల్ల, జయను హాస్టల్ నుండి ఇంటికి తీసుకురావలసివచ్చింది. జయకు జ్వరం తీవ్రంగానే రాసాగింది. మధ్యలో "పిన్నీ! నేను నిజంగా అల్లరి చెయ్యను. నువ్వురావూ?" అని పలవరి స్తూంది. హరి భరించలేకపోయాడు. అతని పితృ హృదయం ఆవేదనతో తల్లడిల్లిపోయింది. అర్థంలేని తన అహంకారానికి తన కూతురును బలి పెట్టుకోలేకపోయాడు. పనిమనిషిని జయ దగ్గిర కాసేపు ఉండమనిచెప్పి మాయను తీసికుని బయలుదేరాడు. మాల

ఇంటికి కొంచెం దూరంలోనే రిక్ష ఆపించి దిగిపోయాడు. ఎంతయినా తనంత తానుగా మాల ఇంటికి రావడాని కతనికి కాళ్ళు రాలేదు. మాయకు మాల ఇల్లు చూపించి "మాయా! అదిగో అమ్మమ్మగారి యిల్లు. అక్కడ పిన్ని ఉంది. పిలుస్తావా?" అన్నాడు. మాయ సంతోషంతో చప్పట్లు కొడుతూ "ఓ పిలుత్తా నాన్నారూ!" అంది.

"చూడు! అక్కయ్యకు జ్వరం వచ్చిందని చెప్పు, నిన్ను రమ్మంటూం దని చెప్పు. ఏం? ఏదీ. ఏం చెప్తావ్ చెప్పు."

"అక్కకు జొలం, నిన్ను లమ్మంది అంతేగా!"

హరి మాయను ముద్దుపెట్టుకుని పంపించి, తా నక్కడే దీపపు స్థంభాన్ని అనుకుని నిలబడ్డాడు.

మాయ పరుగుపరుగున అమ్మమ్మ గారి ఇల్లు ప్రవేశించి. "పిన్నీ!" అని అరిచింది. లోపల గదిలో ఏదో చదువు కుంటున్న మాల, మాయగొంతు విని ఒక్క ఉదుటున బయటకు పరుగెత్తు కొచ్చి. మాయను కౌగలించుకుంది. గబ గబ ముద్దుపెట్టుకుంది. ఆ ప్రేమలో ఉక్కిరి బిక్కిరయి, మాయకూడా సర్వమూ మర్చిపోయింది. ఇంతలో మాల తల్లి అక్కడకు వచ్చి మాయను చూసి ఆశ్చర్యపోతూ "అరే! మాయా! ము వ్వొక్కదానివే, ఎలా వచ్చావే?" అంది.

ఈ మాటలతో మాయా, మాలా, ఇద్దరూ ఈ లోకంలోకి వచ్చారు.

"నేను ఒక్కత్తినీ లాలేదు—నాన్నా గొచ్చారు. మరేమో అక్కకి జ్వరం. పిన్ని లావాలి నేను తీచికెల్తాను" అంది మాయ.

జయకు జ్వరమనగానే మాలకు మాయ రాకకు కారణమర్థమయింది. బహుశా చిన్న జ్వరమయి ఉండదు. రెండు రోజులుగా హరి ఆఫీసుకు రాకుండా ఉంటేనే ఆమె కాందోళనగా ఉంది. వెంటనే మాయ చెయ్యి పుచ్చు కుని "నాన్నగా రెక్కడ?" అంది.

"లా! చూపిత్తా!" అని మాయ బయటకు నడిచి, కొద్ది దూరంలో దీపపు స్థంభాన్నానుకుని, నిల్చున్న హరిని చూపించింది. దిగులుగా ఉన్న ఆ మూర్తిని చూసి మాలకు జాలీ, నవ్వూ రెండూ కలిగాయి. "ఏం మొగవాళ్లు?! ఇలాంటి స్థితిలోకూడా ఎందుకీ అభిమానం?" అనుకుంది. చకచక నాలుగంగల్లో హరిని చేరుకుని "రిక్షాను పిలవండి" అంది. హరి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

ముగ్గురూ ఇంటికి వచ్చేసరికి జయ మెల్లిగా "పిన్ని - పిన్ని" అంటూంది. మాల ఒక్క పరుగున జయ మంచం దగ్గిరగా వచ్చి, జయ బుగ్గలు నిమురుతూ, "నేను వచ్చానమ్మా!" అంది. జయ కళ్ళు విప్పి చూసింది. పిన్నిని చూడంగానే, ఇన్నాళ్ళుగా, ఆ లేత గుండెల్లో కరుడుగట్టిన దుఃఖం ఒక్క సారిగా పెల్లుబికి ప్రవహించింది. మాలకు కూడా కన్నీళ్ళు ఆగటం లేదు. "జయా పిచ్చితల్లీ! ఏడవకమ్మా! నే వచ్చాగా! ఇక్కడే ఉంటాను" అంది.

"ఇక్కడే ఉంటావా? నేను నిజంగా అల్లరిచెయ్యను పిన్నీ! నువ్వు ఇక్కడే వుండు" అని దీనంగా అంది విజయ.

ఆ దీనస్వరం మాల గుండెలను కదిలించివేయగా –

"అదేమిటీ? నువ్వు అల్లరి చేసినందుకు నేను వెళ్ళిపోయావని ఎవరు చెప్పారూ?" అంది.

"నాన్నగారు."

మాల ఉలికిపడి హరివంక చూసింది. అపరాధిలా తలవంచుకున్నాడు హరి.

జయ మాల చేతినిపట్టుకుని నమ్మనన్నట్లు "నువ్వు మళ్ళీ వెళ్ళిపోవుగా!" అంది.

మాలకు బావురుమని ఏడ్వాలనిపించింది.

"లేదమ్మా! నువ్వు అల్లరి చేశావని నేను వెళ్ళలేదు. నాన్నగారు వెళ్ళి పొమ్మంటే వెళ్ళిపోయాను."

"నాన్నారు చెడ్డవారు," అంది జయ చటుక్కున. మాలమనసు కలుక్కుమంది, ఆ పసిగుండెల్లో తండ్రిపట్ల అట్లాంటి భావం కలగటం మంచిదికాదు. హరి చేసిన దోషమే తనూ చెయ్యాలా?

"కాదమ్మా నాన్నగారు మంచివారు. అలా చెప్తే నువ్వు అల్లరి చెయ్యవని అలా చెప్పారు. నువ్వు బంగారు తల్లివి."

హరి మనసు పశ్చాత్తాపంతో కుమిలిపోతోంది. మాల రెండుచేతులూ పట్టుకుని క్షమార్పణ చెప్పుకోవాలని అతని హృదయం ఆత్రుతపడుతూంది.

జయ నిద్రపోయిన తరువాత మాల జయ మంచం దగ్గిర్నుంచి లేచి గదిలోకి రాగానే, మాల చేతులు తనచేతులోకి తీసికొని "నన్ను క్షమించమని అడగటానికికూడా సిగ్గు వేస్తూంది. అయినా, నువ్వు దేవతవు కనుక క్షమించగలవు," అన్నాడు.

హరి పీక్కుపోయిన ముఖమూ, విశ్రాంతిలేక, ఎర్రబారిన అతనికళ్ళూ, దీనమైన అతని స్వరమూ, మాల హృదయంలో అతనిపట్ల ఉన్న విద్వేషభావాన్నంతా చెదరగొట్టి వేసింది. ఆర్ద్రంగా అతని తల నిమురుతూ, "ఊరుకోండి. మనలో మనకొచ్చే చిలిపి తగవులకు క్షమార్పణ లేమిటీ?" అంది.

"అలాకాదు. క్షమించాననూ."

మాల చిలిపిగా నవ్వింది.

"నేను పిచ్చిదానిని. అనవసరంగా గొడవ జేసుకున్నాను. మీ ఇంత తిక్కకీ అసలు కారణం నాకు తెలుసుగా. అందుకు

గర్వపడవలసిన దానికిబదులు, బాధపడి కోపం తెచ్చుకోవట మేమిటీ?"

హరి సిగ్గుపడ్డాడు.

"మాలా! నా కోరిక అన్యాయ మంటావా?"

"అనను. కానీ, మననెత్తిన కొన్ని బాధ్యత లున్నప్పుడూ వాని నిర్వహణ కోసం కొంత ఆనందాన్ని వదలుకోవద్దా మరి? ఏ విషయాన్ని ఏ కోణాన్నుంచి పరిశీలించాలో, ఏ బాధ్యతను ఎలా స్వీక రించాలో, ఏ ఆనందానుభూతి కేది అనువైనదో గుర్తించుకొగలిగితె మనజీవితం ఆనందమయం కాదా?"

హరి సమాధంగా జాలిగా ఆమెవంక చూశాడు.

నిద్రలో కలవరించినట్టుగా, లోపల నుంచి "పిన్నీ!" అని వినిపించింది. మాల, భర్తవేపు నవ్వుతూ చూసింది. హరికూడా నవ్వుతూ "పిన్నీ!" అన్నాడు.

'తప్పు' అన్నట్టుగా, నోటికివేలు అడ్డంపెట్టుకుని చిరునవ్వుతో 'పిన్ని' లోనికి వెళ్ళింది.

